సన్మానం

హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఐదోసారి గెలవడంతో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకుంటున్నారు. గురువారం దారుస్సలాంలో కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్‌కు చెందిన నాయకులు స్థానిక ఎంఐఎం నాయకుడు మహ్మద్ మజహర్ నేతృత్వంలో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు.
– మెహిదీపట్నం

ఎంపీ మల్లు రవికి..

ఎంపీ డాక్టర్ మల్లు రవిని సన్మానిస్తున్న బీసీ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ

కాచిగూడ, జూన్ 6 : స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీకి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని కలిసి గుజ్జ కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నందగోపాల్, శ్రీనివాస్ మేరు ఉన్నారు.

సంగం రామాలయం వద్ద

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న స్థానికులు

- ఆలయ మఠాధిపతి రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో గోల్కొండ తాసీల్దార్‌కు వినతి

మెహిదీపట్నం, జూన్ 6 : తెలంగాణ రెండో భద్రాచలంగా పిలువబడే లంగర్‌హౌస్ సంగం రామచంద్రజీ మఠం రామాలయం వద్ద ఉన్న రాంలీలా మైదానంతో పాటు శ్మశాన వాటిక చుట్టూ పర్యాటక శాఖ గురువారం ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నించగా స్థానికులు, సంగం రామచంద్రజీ మఠం రామాలయం మఠాధిపతి ఆధ్వర్యంలో అడ్డుకుని ఆందోళన చేశారు. ఓ వైపు కోర్టులో కేసు ఉండగానే పర్యాటక శాఖ ఇక్కడ పనులను చేపట్టాలని ప్రయత్నించడం స్థానికుల ఆగ్రహానికి కారణం అయ్యింది. లంగర్‌హౌస్ సంగం వద్ద ఆలయం ఎదుట గోల్కొండ మండలం లంగర్‌హౌస్ గ్రామంలోని సర్వే నంబర్లు 6/1,6/2,6/3,6/4 లో 2 ఎకరాల 8 గుంటల భూమి దేవాదాయశాఖకు చెందినదిగా రికార్డుల్లో ఉన్నది. ఈ భూమిని ఆనుకొని పర్యాటక శాఖకు చెందిన బాపూఘాట్ ఉంటుంది. ఈ క్రమంలో దేవాదాయ శాఖ భూమిని ఆర్ అండ్ బీ వారు రెవెన్యూ శాఖ ద్వారా స్వాధీనం చేసుకుని 1996 లో పర్యాటక శాఖకు అమ్మేశారు.

ఇదే సమయంలో దేవాదాయ శాఖ దీనిపై అభ్యంతరం చెబుతూ.. కోర్టుకు వెళ్లగా పర్యాటకశాఖ వారు డబ్బులను కోర్టులో జమచేసి దీనిని పర్యాటక శాఖ భూమిగా అనుభవిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా 2003 నుంచి దేవాదాయ శాఖ పర్యాటక శాఖకు అక్రమంగా ఈ భూమిని అప్పగించారని, తమ శాఖకు డబ్బులు చెల్లించలేదని దేవాదాయ శాఖ అధికారులు కోర్టులో కేసు వేశారు. 2 ఎకరాల 8 గుంటల భూమి ఇప్పటికీ ఖాళీగా ఉండి సంగం రామమందిర మఠం వారి కబ్జాలో ఉన్నది. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలు, శ్రీరామనవమి, సంగం జాతర నిర్వహిస్తారు. గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సమయంలో మాత్రం పర్యాటక శాఖ పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని కొన్ని గంటలు వాడుకుంటుంది.

లంగర్‌హౌస్ సంగం రామాలయం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రహరీ నిర్మాణానికి యత్నం.. ఆందోళనకు దిగిన ప్రజానీకం

ఎన్నో ఏండ్లుగా సంగం రామచంద్రజీ రామాలయం మఠం ఆధీనంలో ఉన్న ఈ భూమికి గురువారం తెలంగాణ పర్యాటక శాఖ వారు ప్రహరీ నిర్మాణానికి పనులను చేపట్టారు. విషయం తెలిసిన స్థానికులు రాజకీయాలకు అతీతంగా వందలాది మంది అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ మఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ప్రజలందరూ ఈ ప్రహరీ నిర్మాణం జరుగకుండా చూడాలని గోల్కొండ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో పర్యాటక శాఖ ఇలా ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చేయడం చట్టవిరుద్ధమని దీనికి అడ్డుకోవడానికి తాము ఎంతటి ఉద్యమానికైనా రెడీ అని మఠాధిపతి రాహుల్‌దాస్‌బాబా, స్థానిక నాయకులు పేర్కొన్నారు.

ఫెన్సింగ్ వేయకుండా చర్యలు తీసుకుంటా.. : కార్వాన్ ఎమ్మెల్యే

లంగర్‌హౌస్ సంగం వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

మెహిదీపట్నం : లంగర్ హౌస్ సంగం రామచంద్రజీ మఠం ఆలయ ఆవరణలోని రాంలీలా మైదానం స్థలాన్ని పర్యాటకశాఖ బారి నుంచి కాపాడటానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. స్థానికులు సంగం రాంలీలా మైదానం వద్ద జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా గురువారం సాయంత్రం ఎమ్మెల్యే లంగర్‌హౌస్ సంగం రామాలయం వద్ద పర్యటించారు. పర్యాటకశాఖ వారు ప్రహరీ నిర్మించకుండా ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సేవకులు సిరుగుమల్లె రాజువస్తాద్, మఠాధిపతి రాహుల్ దాస్, మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమాసిద్ధిఖీ పాల్గొన్నారు.

రేపే చేప ప్రసాదం పంపిణీ

- పర్యాట్లను పర్యవేక్షించిన ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఫిషరీస్ జాయింట్ కమిషనర్ శంకర్ రాథోడ్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, జూన్ 6 : మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి గాను అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 8వ తేదీన అస్తమా వ్యాధిగ్రస్తులకు బత్తిని కుటుంబ సభ్యులు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఈ చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు గాను నగర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి ఉబ్బస వ్యాధిగ్రస్తులు తరలిరానుండటంతో అధికార యంత్రాంగం అన్ని విధాలా చర్యలు చేపడుతున్నది. గురువారం రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అబిడ్స్ ఏసీపీ ఎ.చంద్ర శేఖర్, హైదరాబాద్ ఆర్‌డీఓ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్,ఫిషరీస్ జాయింట్ కమిషనర్ శంకర్ రాథోడ్ ఇతర అధికారులతో కలిసి చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తం 32 కౌంటర్‌ల ద్వారా చేప ప్రసాదం పంపిణీకి చర్యలు చేపడుతున్నారు. రైల్వే స్టేషన్‌లు, బస్టాండులు, నగరంలోని పలు కూడళ్లు విమానాశ్రయం తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నారు. ఆరు వైద్య ఆరోగ్య శిబిరాలు, 1200 మంది పోలీస్ సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు అబిడ్స్ ఏసీపీ తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

చేప ప్రసాదం పంపిణీకి రావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న బత్తిని సోదరులు

అబిడ్స్, జూన్ 6 : ఈ నెల 8న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగే చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని గురువారం సచివాలయంలోని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చాంబర్‌లో కలిసి బత్తిని సోదరులు ఆహ్వానించారు. వారి వెంట బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శరద్ విశాల్ పిత్తి, రిటైర్డ్ జడ్జి గోపాల్‌సింగ్, శంకర్‌లాల్ యాదవ్, కైలాస్ కేడియా, ప్రదీప్‌అగర్వాల్ పాల్గొన్నారు.

వానకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు : కార్పొరేటర్

చిక్కడపల్లి, జూన్ 6 : వానకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. గురువారం కార్పొరేటర్ సబర్మతినగర్ తదితర ప్రాంతాల్లో ఇరిగేషన్ శాఖ ఏఈ శ్యామ్ సుందర్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి పర్యటించారు. సబర్మతి నగర్‌లో వరదనీరు నిల్వకుండా, రోడ్డుపై తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. బీజేపీ నాయకులు ఎ.వినయ్‌కుమార్, ఉమేశ్, రహమత్ ఆలీ పాల్గొన్నారు.

బజరంగ్ సేన ఆధ్వర్యంలో ర్యాలీ

అయోధ్య రామ మందిరం ప్రాంతంలో బజరంగ్ సేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. సేన జాతీయ అధ్యక్షుడు భగేంద్ర వ్యాస్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి అశోక్ శర్మ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో కార్యక్రమంలో రజనిశ్రీరామోజు, దీపషా, సూర్యశుక్లా, యెర్రం శ్రీనివాస్, సునీల్ అగర్వాల్, రామేశ్వర్ మిశ్రా, రాజారాం, దయానంద్‌రెడ్డి, నరేశ్ చందు, తదితరులు పాల్గొన్నారు. – అబిడ్స్

ఘనంగా సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం

సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ 42 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం సంగీత, నృత్య సమ్మేళనం నిర్వహించారు. పలువురు ఔత్సాహిక కళాకారులు భారతీయ శాస్త్రీయ సంప్రదాయ ఆధ్యాత్మిక అంశాలకు తమదైన శైలిలో నర్తించారు. సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ దేవసేన నృత్య గురువులను ప్రశంసించారు. – తెలుగు యూనివర్సిటీ

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కుల ధ్రువపత్రాలు

చిక్కడపల్లి, జూన్ 6 : పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా కుల ధ్రువపత్రం ఇస్తున్నామని సంఘం అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో కుల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని కులబాంధవులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బింగి నవీన్ కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, మల్లికార్జున్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించండి..

ఆషాఢ బోనాలు ప్రారంభమయ్యే చారిత్రాత్మక గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించాలంటూ కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు శోభా పాండే గురువారం కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో కొనసాగుతూ పార్టీని కాపాడుకుంటున్న నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. – మెహిదీపట్నం

బీఆర్ఎస్ నేత నర్సింగ్ ముదిరాజ్‌కు పితృవియోగం

- పరామర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూన్ 6 : గోల్నాక డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సి.నర్సింగ్ ముదిరాజ్ తండ్రి సి.కృష్ణ గురువారం అన్నపూర్ణ నగర్‌లో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ నర్సింగ్ ముదిరాజ్ ఇంటికి వెళ్లి కృష్ణ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబసభ్యులకు తన సానుభూతిని ప్రకటించారు. – అంబర్‌పేట

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

అబిడ్స్, జూన్ 6 : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడుతోందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. బీర్ల ఐలయ్య దంపతులను రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూముకుంట అరుణ్‌కుమార్ లెహరి దంపతులు, తుర్కయాంజాల్ సర్పంచ్ కొత్త కురుమ మంగ, కొత్త కురుమ శివకుమార్, రవి, మల్లేశ్, ఎలమంద, జ్యోతి రెడ్డి సన్మానించారు. నాయకులు బీర్ల ఐలయ్యకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆయన ద్వారా కేక్ కట్ చేయించారు.

కలుషిత నీటి సరఫరా పరిశీలన..

- సమస్యను పరిష్కరిస్తామన్న అధికారులు

కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి,వాటర్‌వర్క్స్ అధికారి విష్ణువర్ధన్‌రావు

అంబర్‌పేట, జూన్ 6 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎదురు గల్లీలో తాగునీరు కలుషితమై వస్తున్నది. స్థానికులు ఈ విషయాన్ని అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. ఇటీవల కలుషిత నీటి సరఫరా పెరుగగా.. వారం క్రితం విషయం మీడియాలో పెద్ద ఎత్తున వచ్చింది. స్పందించిన వాటర్‌వర్క్స్ డీజీఎం విష్ణువర్ధన్‌రావు, ఏఈ మాజిద్, సూపర్‌వైజర్ బాలకృష్ణ సందర్శించారు. కార్పొరేటర్ బి.పద్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకట రెడ్డి కూడా బస్తీకి వచ్చారు. గురువారం బస్తీలో నీటి సరఫరా ఉండడంతో నీరు ఎలా వస్తుందనే విషయాన్ని పరిశీలించారు. నీరు కలుషితమై వస్తుందా?.. లేదా? అనే విషయాన్ని తెలుసుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిర్యాల శ్రీనివాస్, రాకేశ్, ఆనంద్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీవరేజీ లైన్ల ఆధునీకరణ

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్ అల్‌హస్నత్ కాలనీలో సీవరేజీ లైన్ల ఆధునీకరణ పనులను జలమండలి అధికారులు చేపట్టారు. గురువారం జీహెచ్ఎంసీ స్టాం డింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.
– మెహిదీపట్నం

ఎల్వోసీ అందజేత

ఆసిఫ్‌నగర్‌కు చెందిన బి.పాండుకు మంజూరైన లక్ష రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెందిన ఎల్వోసీని గురువారం నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అందజేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. – మెహిదీపట్నం

కారు డ్రైవర్ అదృశ్యం

అదృశ్యమైన ప్రకాశ్(ఫైల్)

కాచిగూడ,జూన్ 6 : కారు డ్రైవర్ అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ వివరాల ప్రకారం..బర్కత్‌పురలోని రుక్కుస్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన యాకయ్య కుమారుడు డి. ప్రకాశ్ కారుడ్రైవర్. 5న డ్యూటీ మీద విజయవాడకు వెళ్లి వస్తానని చెప్పిన ప్రకాశ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో తల్లి రమ గురువారం రాత్రి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరోచోట మహిళ..

ప్రభావతి(ఫైల్)

అబిడ్స్, జూన్ 6 : మహిళ అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పీఎస్ పరిధిలోని జిన్సీచౌరాయిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిన్సిచౌరాయి ప్రాంతంలో నివాసముండే ప్రభావతి చీరల దుకాణంలో పని చేస్తుంది. గత నెల తొమ్మిదవ తేదీ ఉదయం10:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేక పోవడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అస్లం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముదిగొండ శివప్రసాద్‌కు వాసా ప్రభావతి పురస్కారం

ముదిగొండ శివప్రసాద్‌కు పురస్కారాన్ని అందించిన కేవీ రమణాచారి

ముషీరాబాద్, జూన్ 6 : ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి శాస్త్రి జయంతిని పురస్కరించుకొని గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నవలా రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌కు వాసా ప్రభావతి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆచార్య శివప్రసాద్, ప్రొఫెసర్ కోలవెన్ను మలయవాసినికి పురస్కారం అందజేశారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వాణి, శైలజ మిత్ర, గుడిపాటి వెంకటేశ్వర్లు, పొత్తూరి సుబ్బారావు, మద్దాళి రఘురామ్, వాసా ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసా ప్రకాశ్, జె.మీనాక్షి పాల్గొన్నారు.

గర్భిణులు సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలి

అబిడ్స్, జూన్ 6 : గర్భిణులు సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలని ఫెర్నాండెజ్ క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ లతాశశి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు ఆహార భద్రతా ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. కామెర్లు, లూజ్ స్టూల్స్ వంటి అనారోగ్య పరిస్థితులను నివారించడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాజాగా వండిన వంటకాలను తీసుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని మాత్రమే బాటిల్స్‌లో వినియోగించాలని, సీ ఫుడ్ తీసుకునే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, ప్యాక్ చేసిన వస్తువులను తీసుకోవద్దని సూచించారు.

16న ఉచిత వైద్యశిబిరం..

కాచిగూడ, జూన్ 6 : రెడ్‌క్రాస్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ రాయల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని 16న(ఆదివారం) నిర్వహిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంబర్‌పేట కమ్యూనిటీ హాల్లో ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9949238492 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్పెషల్ రైలులో చోరీ

కాచిగూడ,జూన్ 6 : స్పెషల్ రైలులో మహిళ బ్యాగులోంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని అకోలాకు చెందిన నరేశ్ భార్య అర్చన లాల్‌గా– కాచిగూడ స్పెషల్ రైలులో కాచిగూడకు వస్తుండగా నాందేడ్ రైల్వేస్టేషన్ సమీపంలో దుండగులు ఆమె బ్యాగులోని 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేలు, 2 సెల్‌ఫోన్లను దొంగిలించి పారిపోయారు. గురువారం అర్చన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బీజీ ప్రసాద్‌రావు తెలిపారు.

ఆకస్మిక వర్షం.. చెరువులను తలపించిన రోడ్లు

ఇందిరాపార్కు స్టీల్‌బ్రిడ్జి కింద చెరువును తలపిస్తున్న రోడ్లు

కవాడిగూడ, జూన్ 6 : అరగంట పాటు పడిన వర్షం వల్ల గురువారం సాయంత్రం కవాడిగూడ, ఇందిరాపార్కు, లోయర్ ట్యాంక్‌బండ్, అశోక్‌నగర్ బ్రిడ్జి, గాంధీనగర్ కొత్త బ్రిడ్జి వద్ద వర్షపు నీరు చేరుకొని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. అశోక్‌నగర్ బ్రిడ్జి సమీపంలోని కాలనీలో పెద్ద చెట్టు విరిగి విద్యుత్‌స్తంభాలపై పడటంతో రెండు స్తంభాలు పడి ట్రాన్స్‌ఫార్మర్ ఊడిపడింది. జీహెచ్ఎంసీ డిజాస్టర్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేసుకొని చర్యలు చేపట్టి చెట్టును తొలగించారు. విద్యుత్ స్తంభాల తొలగింపుతో పాటు పునరుద్ధరణకు డీఈ మక్సూద్ అహ్మద్ దగ్గరుండి చర్యలు చేపట్టారు.

వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

బస్తీ వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, జూన్ 6 : గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో వరద నీటి సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ చర్యలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహా అన్నారు. గురువారం ముఠా జయసింహా అరుంధతినగర్ బస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. భారీ వర్షం కారణంగా మ్యాన్‌హోల్ పొంగి పొర్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా.. చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, జీవై గిరి, సరస్వతి, హనుమంతు, ఎండీ గౌస్, విట్టల్, బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

ఈఎంఈ సెయిలింగ్ పోటీలు షురూ..

సికింద్రాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ)/ హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్మీకి చెందిన ఈఎమ్ఈ వార్షిక సెయిలింగ్ రెగెట్టా చాంపియన్‌షిప్‌నకు తెరలేచింది. ద క్రాప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఈఎంఈ) సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్ పోటీలను లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్‌నాయ్ ప్రారంభించారు. సెయిలింగ్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రాప్స్ ఆఫ్ ఈఎంఈ సెయిలింగ్ రెగెట్టా – 2024 పోటీల వివరాలను వెల్లడించారు.

ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో దేశంలోని వివిధ ఆర్మీ యూనిట్లకు చెందిన సెయిలర్లు పోటీపడుతున్నారు. రెగెట్టా టోర్నీలో రాణించడం ద్వారా భవిష్యత్‌లో ఆర్మీ యాచింగ్‌లో శిక్షణతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో దేశం ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం లభించనుంది. సెయిలింగ్ ద్వారా టీమ్ వర్క్ అభివృద్ధి చెందడంతో పాటు ఆలోచన విధానం మారుతుందని నీరజ్ పేర్కొన్నారు.

అమావాస్య పూజలు

గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ మహంకాళి ఆలయంలో గురువారం బోనాల కులవృత్తుల సంఘం నాయకులతో కలిసి మహంకాళి ఆలయ పూజారి సురేశ్ చారి అమావాస్య సందర్భంగా పూజలు చేశారు. పూజల్లో లక్ష్మణ్, డింకు, శివరాజ్ పాల్గొన్నారు.
– మెహిదీపట్నం

గుండుపోచమ్మ ఆలయంలో

అంబేద్కర్‌నగర్‌లో గుండుపోచమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజల ఈ సందర్భంగా లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు నర్సింగ్‌రావును ఆలయ కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వసంత్‌రెడ్డి, బుజిలి మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ ఆరెళ్ల కృష్ణాయాదవ్, బస్తీ నాయకులు కిట్టుగౌడ్, జయరాజ్, గోవింద్‌రాజ్ వినేశ్‌సింగ్, దాస్ పాల్గొన్నారు.
– మెహిదీపట్నం

బీసీసీపీఎల్ విజేత పవర్ హిట్టర్స్ టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి : అత్తాపూర్‌లోని స్టైయిట్ డ్రైవ్ వేదికగా జరిగిన బాక్స్ క